క్లుప్తంగా

క్షత్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు



ఆర్మూర్‌టౌన్: క్షత్రియ కులస్తులను ఆయురారోగ్యాలతో ఉండాలని, పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని కోరుతూ క్షత్రియ మహిళా మండలి సభ్యులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ మందిరం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ముత్యాలమ్మ, నల్ల పోచమ్మకు జలాభిషేకం చేశారు. నల్లపోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. క్షత్రీయ సమాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ నివేదిక అమలు చేయాలి



వేల్పూర్: రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించి పీఆర్సీ నివేదిక తెప్పించి అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ కస్తూర్బాస్కూలు, పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడి, మోతె, వేల్పూర్, వెంకటాపూర్, అంక్సాపూర్, ఇతర గ్రామాల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.దాసు, రాసరి పెంటన్న, కార్యదర్శి కే.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



ఆర్మూర్‌టౌన్: ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే వస్తాయని మార్కెట్‌మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 14వ వార్డులో ఇంరిమ్మ ఇళ్ల లబ్ధిదారులు సుగంధరాణి, పహిమాబేగం, ఫరాబేగం, అంజుమ్‌ఖాన్, రేష్మబేగం ఖాతాలో రూ. లక్ష జమ చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, ఇంతియాజ్, మహమ్మద్, రేహమాన్, శాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

మోర్తాడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగంగా పూర్తి చేయాలని భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ సూచించారు. ఆయన బుధవారం భీమ్‌గల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోడానికి సర్వే..



మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న వారి వివరాలను నమోదు చేయడంతో పాటు ఇంకా సమస్యలు ఏమన్నా ఉంటే తెలుసుకోవడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ సూచించారు. పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో వినూత్న పద్ధతిలో సర్వే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజల వినతులను సేకరించిన తరువాత వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన నాయకులు, కార్యక్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణా గౌడ్ ఇటీవల జరిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయికృష్ణా గౌడ్‌ను సన్మానించి అభినందించారు. ఇందులో అధ్యక్షులు ముత్యం నారాగౌడ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ గౌడ్, దశాగౌడ్, భూమాగౌడ్, నర్సాగౌడ్, గణేష్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్‌గౌడ్‌లున్నారు.

అడుగడుగునా గుంతలే

అధ్వానంగా జీజీ నడ్కుడ రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- నిధులు మంజూరైనా పనులు చేపట్టని కాంట్రాక్టర్



కంకర తేలి ప్రమాదకరంగా మారిన జీజీ నడ్కుడ బీటీ రోడ్డు

డొంకేశ్వర్(ఆర్మూర్) : మండలంలోని నూత్‌పల్లి నుంచి జీజీ నడ్కుడకు వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. నూత్‌పల్లి శివారు నుంచి జీజీ నడ్కుడ వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు ఉంది. ఈరోడ్డు కంకర తేలి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు పలుచోట్ల తారులేచి పోయి బురదగా మారింది. జీజీ నడ్కుడతో పాటు గాదేపల్లి, చిన్నయానం గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన రోడ్డు. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఈరోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌కు వెళ్లాలంటే సందర్శకులు జీజీ నడ్కుడ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. చాలాసార్లు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులకు గాయాలయ్యాయి. రోడ్డు గురించి మూడు గ్రామాల ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 2023లో కొత్త రోడ్డు వేసేందుకు ఆర్అండ్‌బీ శాఖకు రూ.3.20కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు నిర్వహించి ఓ గుత్తేదారుతో అగ్రిమెంట్‌ను కూడా పూర్తి చేసుకున్నారు. సదరు కాంట్రాక్టర్ గతంలో చేసిన పనులకే బిల్లులు రావడం లేదనే కారణంతో పనులు ప్రారంభించలేదు. దీంతో టెండరును రద్దు చేయాలని అధికారులు భావిస్తున్నారు. మళ్లీ టెండర్ల నిర్వహిస్తారా? అని ఆర్అండ్‌బీ ఏఈ రఘుని 'సాక్షి' వివరణ కోరగా.. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.





వర్షానికి తారు లేచిపోయి ఏర్పడిన గుంతలు, నూత్‌పల్లి శివారులో బురదమయంగా మారిన రోడ్డు

మరమ్మతులైనా చేయాలి



కొత్త రోడ్డుకు నిధులు మంజూరైన పనులు మొదలు కాలేదు. ప్రమాదకరంగా మారిన రోడ్డుపై ప్రయాణించలేని పరిస్థితి ఉంది. అధికారులు తాత్కాలికంగా మరమ్మతు పనులు చేసి గుంతలను పూడ్చాలి. లేనిచో మరిన్ని ప్రమాదాలు జరుగుతాయి.

– మగ్గిడి చిన్నారెడ్డి, జీజీ నడ్కుడ

నేటి చిత్రం



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టండి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ప్రాజెక్ట్‌లోని కాలనీవాసులకు నీటి సరఫరా చేసే పైపు లైన్‌కు భారీ లీకేజీ ఏర్పడింది. కాకతీయకాలువ జీరో పాయింట్ వద్ద నీరు వృథాగా పోవడంతో కలుషితమవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. – భరత్, ఎస్సారెస్పీ కాలనీ వాసీ

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటుదాం



దేగాంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆలూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అలాగే గౌడ సంఘం, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈత మొక్కలను నాటారు. దీంతో పాటు గ్రామంలో గంగా పుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న గంగమ్మ ఆలయానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో శ్రీనివాస్, బీజేపీ నాయకులు బంగారు యాదగిరి, బింగి పెంటయ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి, మూత్ర శాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. వెంకటరమణ చారి, లక్ష్మణ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిట్లో వైద్యం అందించేలా..

- పలు చోట్ల పల్లెదవాఖానాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల



సోన్‌పేట్ గ్రామంలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ/మోర్తాడ్/వేల్పూర్ : పల్లె ముంగిట్లో వైద్య సేవలు అందించడం మాజీ సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే సాధ్యమైందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్, మెండోరా మండలం నెహ్రూనగర్‌లో 20 లక్షల చొప్పున నిధులతో నిర్మించిన జీపీ భవనాలను, ముప్కాల్ మండల కేంద్రంలో, మెండోరా మండలం సోన్‌పేట్‌లో 20 లక్షల చొప్పున నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాల భవనాలను ఆయన ప్రారంభించారు. మోర్తాడ్ మండలం పాలెంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖానా భవనంను ఎమ్మెల్యే ప్రారంభించారు. భీమ్‌గల్ మండలంలోని పెద్దమ్మకాడి తాండాలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంను ఎమ్మెల్యే ప్రారంభించారు.ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ప్రా రంభించాలని పాఠశాల ఎస్‌వో వినోద ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి విన్నవించారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.బాల్కొండ మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు కట్టెల శ్రీనివాస్‌గౌడ్ వేల్పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు ఎక్కల్‌దేవి సురేష్ బీఆర్ఎస్ చేరారు. మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ప్రశాంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, అధికారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూముకు కొత్త షటర్ ఏర్పాటు చేయాలని వినతి



బోధన్: మంగల్‌పాడ్ గ్రామ కట్టమైసమ్మ చెరువు తూము షటర్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతూ బుధవారం ఎడపల్లిలో ఇరిగేషన్ శాఖ ఏఈ కుశాల్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. తూము షటర్ పనిచేయపోవడంతో చెరువులోంచి నీళ్లు పంట పొలాలకు సరఫరా అయ్యే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. కొత్త షటరు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు నాగరాజు ,చిట్యాల రాజేందర్, బండ లింగారెడ్డి,దెగ్లూర్ సుమన్,సాయినాథ్,పోశెట్టి, గాండ్ల సాయిలు, కుమ్మరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి సమస్యను వివరిస్తున్న జానకంపేట గ్రామస్తులు

బోధన్ : ఎడపల్లి తహసీల్ ఆఫీస్‌కు వచ్చిన కలెక్టర్‌కు జానకంపేట గ్రామస్తులు వినతి పత్రం అందించారు. తమ గ్రామంలోని బోధన్ –నిజామాబాద్ రోడ్డు ఉన్న పెట్రోల్ బంక్ పక్కన నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు పూర్వీకుల కాలం నుంచి దారికి అడ్డంగా బంక్ నిర్వాహకుడు ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. గతంలాగే వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

మహిళాశక్తి సంబురాలలో పాల్గొనాలి

- ఐకేపీ జిల్లా ప్రాజెక్టు అధికారి సంధ్యారాణి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఐకేపీ జిల్లా ప్రాజెక్టు అధికారి సంధ్యారాణి

వేల్పూర్/నందిపేట్/బాల్కొండ: ఇందిరా మహిళా శక్తి సంబురాలలో మహిళాగ్రూపుల సభ్యులంతా భాగస్వామ్యం కావాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు అధికారి సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబరాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వడ్డీలేని రుణాలు తీసుకొని లబ్ధిపొందాలని చెప్పారు. వేల్పూర్‌కు చెందిన రియానాబేగం బ్యాంకు నుంచి రుణం తీసుకొని మరణించడంతో ఆమెకు రూ.1,87,631 చెక్కును ఆమె కుమారునిడికి అందజేశారు. నందిపేట మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మండల తహసీల్దార్ సంతోష్, ఐకేపీ ఏపీఎం మాణిక్యంలు సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సీసీ స్వరూప అన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

- మొక్కలపెంపకంతో సకాలంలో వర్షాలు కురుస్తాయి
- కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



బోధన్ మధుమలంచ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బోధన్‌రూరల్ : వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో గల మధుమలంచ డిగ్రీ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మొక్కలు నాటి జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. అనంతరం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పక్షం రోజులలోనే పూర్తి స్థాయిలో మొక్కలు నాటి సంపూర్ణ లక్ష్యం సాధించేలా ప్రణాళికతో ముందుకుసాగుతామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 51.11 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



రాణంపల్లి శివారులో ఈత మొక్కలను నాటుతున్న అధికారులు

రుద్రూర్/మాక్లూర్/రెంజల్/బాల్కొండ : రుద్రూర్ మండలం రాణంపల్లి శివారులో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో ఎండీ జలీల్ ఉద్దీన్ మాట్లాడుతూ.. రాణంపల్లి క్యాంపులో సుమారు వేయి ఈత మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. మాక్లూర్ సొసైటీ ప్రాంగణంలో డైరెక్టర్లతో కలిసి చైర్మన్ బూరోల్ల అశోక్ మొక్కలు నాటారు.రెంజల్ మండలం దూపల్లి హైస్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు మొక్కలు నాటారు.బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏక్‌పేడ్ మాకా నామ్ (అమ్మ పేరున ఒక మొక్క) కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటిన ప్రతి మొక్కను సంక్షించాలని ఎంఈవో రాజేశ్వర్ సూచించారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఐక్యంగా పోరాడుదాం

- పిలుపునిచ్చిన కార్మిక సంఘాల నేతలు
- సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు



బోధన్‌లో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

సాక్షి నెట్ వర్క్ : కేంద్ర ప్రభుత్వం అనురిస్తున్న కార్మిక,రైతు, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొన్నారు. టీయూసీఐ, సీఐటీయూ. ఐఎఫ్‌టీయూ, డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులతో భారీ ర్యాలీ,సభను నిర్వహించారు. పలుచోట్ల నిరసనలు వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఐక్యంగా పోరాడుదామని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు



భీమ్‌గల్‌లో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



పెర్కిట్‌లో ఏబీవీపీ జెండాను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్)/బోధన్‌టౌన్/నవీపేట : ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పెర్కిట్, బోధన్ పట్టణం, నవీపేటలో ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా ఏబీవీపీ నాయకులు జెండాను ఆవిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాడుతుందని నాయకులు పేర్కొన్నారు.

సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో అరుగురి బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మాజీ సర్పంచ్ సుర్బిర్యాల జీవన్ రెడ్డి అందజేశారు. నాయకులు కేపీ గంగా రెడ్డి, జీ నర్సయ్య, టీ గంగయ్య, సాయి రెడ్డి, జీ సాగర్, సందీప్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో రాజకీయం తగదు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ నుంచి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులు రాజకీయ జోక్యంతో పనులు నిలిచిపోయాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అల్లూరి గంగా రెడ్డి ఆరోపించారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

కోటగిరిలో ఆపరేషన్ ముస్కాన్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముస్కాన్ బృందం మండల కేంద్రంలో పర్యటించి పనుల్లో ఉన్న మైనర్ పిల్లలకు, వారిని పనులు పెట్టుకున్న వ్యాపారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోధన్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు, ఎస్సై పీటర్ , పీసీలు అశన్న, గంగాధర్, సతీష్ గంగాధర్ తదితరులున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 11వ తేదీ చివరి గడువని తెలిపారు. వివరాలకు 9490149699, 9912095608ను సంప్రదించాలన్నారు.

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి

బోధన్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీయూఎస్(తపస్) సీనియర్ నాయకులు కర్నె శంకర్ కోరారు. బుధవారం బోధన్ మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు.మండల అధ్యక్షులు సుంకినికర్ సంజీవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల నగేష్, కార్యకర్తలు లోగం శంకర్, బొనిగె జగదీష్,నార్ల గంగా కిషోర్ తదితరులున్నారు.

ముగిసిన సప్తాహం

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో ఈ నెల 3న ప్రారంభమైన గురుపౌర్ణమి సప్తాహం కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో పాండురంగ స్వామిని స్తుతిస్తూ భజనలు చేశారు. భక్తులకు మంగిరాములు మహరాజ్ బొట్టు పెట్టి ఆశీర్వదించారు.

గ్రంథాలయాలకు పాఠకుల ఆదరణ

బోధన్: జిల్లాలో గ్రంథాలయాలకు పాఠకుల ఆదరణ క్రమంగా పెరుగుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. బుధవారం బోధన్ శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయాల్లో విద్యార్థులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు సభ్యులుగా చేరాలని, పుస్తకాలను తీసుకెళ్లి ఇంటి వద్దనే చదువుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.